

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న చిన్నాఆరెపల్లి గ్రామ బీజేపీ నాయకులు

## బీఆర్‌ఎస్‌లో చేరికలు

రాయపోల్, అక్టోబర్ 14 : గజ్వేల్ మండలం చిన్నారెపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శనివారం దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆంజనేయులు, గోపాల్, రాములు, మల్లేశం, సాజిద్‌కు ఎంపీ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు మున్నా, నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు రావాలని ఆహ్వానం



ప్రతాప్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

వర్గల్, అక్టోబర్ 14 : వర్గల్ శంభునిగిరి కొండపై కొలువుదీరిన చదువులతల్లి సరస్వతీమాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పాలకమండలి సభ్యులు తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా కోరుతూ శనివారం గజ్వేల్ సీఎం క్యాంపు కార్యాలయంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని ఆలయ పాలకమండలి సభ్యులు కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

## పేదలకు బట్టల పంపిణీ

వర్గల్, అక్టోబర్ 14 : బీఆర్‌ఎస్ నాయకుడు, తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు వేలూరి దివ్యాకృష్ణారెడ్డి దంపతులు నిరుపేదలకు బట్టలు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని తున్కిఖలామీనాజిపేట, అంబార్‌పేట, శాకారం, గిర్మాపూర్, గోవిందాపూర్, శేరిపల్లి, చౌదర్‌పల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లోని మొత్తం 121 మంది నిరుపేదలకు అన్నదానంతోపాటు దసరా పండుగను పురస్కరించుకొని ఉచితంగా కొత్త బట్టలు పంపిణీ చేశారు.

## శిల్పారామాన్ని సందర్శించిన ఎన్‌సీసీ కేడెట్లు

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 14 : జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాంపు కేడెట్లు పర్యటనలో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని శిల్పారామాన్ని సందర్శించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ కేడెట్లు మొదటగా ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, శిల్పారామాన్ని సందర్శించారు. అంతకుముందు ఢిల్లీ– పంజాబ్, బీహార్ – ఒడిశా డైరెక్టరేట్ల మధ్య నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఢిల్లీ, ఒడిశా జట్లు గెలుపొందినట్లు క్యాంపు క్రీడాధికారి లెఫ్టినెంట్ కల్నల్ జైస్వాల్ తెలిపారు.

# పథకాలను అడ్డుకోవడం దురదృష్టకరం

**ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు**

మిరుదొడ్డి, అక్టోబర్ 14 : పేదలను ఆర్థికంగా ఆదుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, బీసీ, మైనార్టీ బంధు పథకాలను అమలు చేస్తుంటే.. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు వాటిని అడ్డుకోవడం దురదృష్టకరమని ఎంపీపీ గజ్జల సాయిలు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దుబ్బాక ఎమ్మెల్యే రఘుందన్‌రావు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి గ్రామాల్లో చీరలు, గొడుగులు, బ్యాగులు పంచుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలు అందుతుంటే వాటిని అడ్డుకోవడానికి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడమేంటని ప్రశ్నించారు. ఫించన్లు, ఎస్సీ, బీసీ, మైనార్టీ బంధు పథకాలను ఆపడంతో నీకు ప్రజలపై ఉన్న ప్రేమేంటో అర్థమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో రఘునందన్‌రావుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు లింగం, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు సత్తయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి : మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల సాయిలు, బీఆర్‌ఎస్ నాయకులు

**దళిత వ్యతిరేకి రఘునందన్‌రావు..**

తొగుట, అక్టోబర్ 14 : దళిత వ్యతిరేకి దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మరోసారి తన నిజస్వరూపాన్ని చాటుకున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేయాలని రాఘునందన్‌రావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పేదలపై తన వ్యతిరేకతను చాటుకున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దళిత బంధు పథకాన్ని ప్రవేశపెడితే, దాన్ని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. కేంద్రం నుంచి రూపాయి తెచ్చిందిలేదు కానీ.. బీఆర్‌ఎస్ సర్కారు పథకాలను అడ్డుకోవడంతో తన క్రిమినల్ బుద్ధి చాటుకున్నారని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అడ్డుకున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావును ఎక్కడికక్కడ నిలదీయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

# రఘునందన్‌రావు గ్రామాల్లోకి వస్తే నిలదీయాలి

రాయపోల్, అక్టోబర్ 14 : దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు గ్రామాల్లోకి వస్తే ప్రజలు నిలదీయాలని దౌల్తాబాద్ మండల సర్పంచులు అన్నారు. దౌల్తాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పుజితావెంకట్‌రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండగా ఓటమి భయంతో ఎమ్మెల్యే రఘునందన్‌రావు పథకాల నిలుపుదలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం సిగ్గుచేటన్నారు. గత ఉప ఎన్నికల్లో గెలిచి మూడేండ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రభుత్వ పథకాలు అడ్డుకుంటున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు గ్రామాల్లో ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీ కో–ప్షెన్ సభ్యుడు రహీమొద్దీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు పాల్గొన్నారు.



రఘునందన్‌రావు ఈసీకి రాసిన పత్రాలను చూపుతున్న నాయకులు

# గౌడలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి



మండల కేంద్రంలో ఈత మొక్కలు నాటుతున్న గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్

మర్కూక్, అక్టోబర్ 14 : గౌడలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని, మేటి శక్తిగా ఎదగాలంటే ఐక్యంగా పోరాడాలని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో గౌడ సంఘం సభ్యులతో కలిసి ఈత మొక్కలు నాటారు. అంతకుముందు పాములపర్తి గ్రామంలోని ఎల్లమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడలు తమ హక్కుల కోసం పోరాడాలని, పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, మాజీ సర్పంచ్ మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## కేసీఆర్‌తోనే అన్నివర్గాలకు సమన్యాయం

గజ్వేల్, అక్టోబర్ 14 : సీఎం కేసీఆర్‌తోనే అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతున్నదని గజ్వేల్ డివిజన్ ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంతో రెండు పర్యాయాలు సీఎం కేసీఆర్‌ను ఎలా దీవించారో అంతకుమించి మెజార్టీని ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు సీఎం కేసీఆర్‌ను మళ్లీ స్వాగతిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిచ్చారని, 24 గంటల ఉచిత కరెంట్‌తో రైతుల ఇబ్బందులు తొలిగాయని చెప్పారు. దేశంలో ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. ఉచిత విద్యుత్‌తో రైతుల కష్టాలు తీరడంతో మూడు పంటలు పండించుకుంటూ రైతులు సంతోషంతో ఉన్నారన్నారు. మూడేండ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి బీడు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణలో ఎక్కడ చూసినా పచ్చటి పంటపొలాలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, సకాలంలో ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడంతో రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించేలా సీఎం కేసీఆర్ పాలన ఉందన్నారు.



గజ్వేల్ మహంకాళి అమ్మవారు

# ముగ్గురమ్మల కొలువులో శరన్నవరాత్రి శోభ

**● నేటి నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ● ముస్తాబవుతున్న ఆలయాలు**

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 14 : పట్టణంలోని ముగ్గురమ్మల ఆలయాలు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. పట్టణంలోని మహంకాళి ఆలయం, సంతోషిమాత ఆలయం, అన్నపూర్ణ విశ్వేశ్వరాలయాల్లో ఆదివారం నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు వివిధ అలంకారాల్లో అమ్మవారి మూలమూర్తులను అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. ఆలయ పునర్నిర్మాణం నాటి నుంచి గజ్వేల్ మహంకాళి ఆలయంలో దసరా నవరాత్రులు, ఆషాఢం బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రంగుల చీరలతో గజ్వేల్ మహంకాళి అమ్మవారిని కుమారీదేవిగా అలంకరించి పూజించనున్నారు. వరుసగా పండ్లు, పూలతో త్రిమూర్తి, కల్యాణి, రోహిణి, కాళికా, చండికా, శాంభవి, తొమ్మిదో రోజు సుభద్రాదేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. అదేరోజు చండీహోమ పూర్ణాహుతి నిర్వహిస్తారు. దసరా రోజున అమ్మవారికి పట్టాభిషేకం నిర్వహిస్తారు. గజ్వేల్ పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారి మూలవిరాట్ ఆదివారం నుంచి వరుసగా తొమ్మిది రోజులపాటు బాలత్రిపుర సుందరి, రాజరాజేశ్వరి, అన్నపూర్ణాదేవి, అర్ధనారీశ్వరి, లలితా పరమేశ్వరి, సరస్వతి, కనక మహాలక్ష్మి, మహిశాసురమర్ధినిగా అమ్మవారు దర్శనమిస్తారు. దసరా రోజు సంతోషిమాతగా అమ్మవారు దర్శనమిస్తారు. ఆలయంలో ప్రతి రోజూ ఉత్సవమూర్తికి పూజలు, చండీహోమం, నిత్యాన్నదానం, సాంస్కృతిక కళాప్రదర్శనలు నిర్వహించనున్నారు. గజ్వేల్‌లోని అన్నపూర్ణ విశ్వేశ్వరాంజనేయ ఆలయం శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించనున్నారు. అన్నపూర్ణాదేవికి నిత్య పూజలు, శ్రీచక్రార్చన, సహస్ర కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణ, నిత్యాన్నదాన కార్యక్రమాలు చేపడుతారు.



గజ్వేల్‌లోని సంతోషిమాత